సొంతవారే కొంపముంచారా?

- పొంగులేటికి కాంగ్రెస్‌లోనే ఇంటిపోరు
- మరో ఏక్‌నాథ్ షిండే కావొచ్చని అనుమానమా
- ఆయనంటే ముఖ్యనేతకు, అనుచరులకు కంటగింపు
- అందులో భాగమే ఈడీ దాడులంటున్న పొంగులేటి అనుచరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎవరికి టార్గెట్ అయ్యారు? రోజురోజుకు రాష్ట్రంలో కీలక నేతగా ఎదుగుతున్న ఆయన ఎవరికి కంటగింపుగా మారారు? చోటా భాయ్‌కా? లేక బడే భాయ్‌కా? సీనియర్ పెద్దలకా? ఈడీ కొరడా విసరడం వెనుక ఏ రాడార్ పనిచేసింది? గాంధీభవన్ పరిసరాల్లో ఏ ఇద్దరు నేతలు కలిసినా ఇదే అంశం మీద చర్చ జరుగుతున్నది. పదేండ్ల స్వల్పకాలంలోనే కీలక ఆర్థిక, రాజకీయ శక్తిగా ఎదిగిన పొంగులేటి మెల్లమెల్లగా సొంత ఎమ్మెల్యేల బలం పెంచుకుంటున్నారని, కర్ణాటకలో డీకే శివకుమార్ తరహాలో మారుతున్నారని గత ఐదారు నెలలుగా కాంగ్రెస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇప్పటికిప్పుడు ఆయన బలప్రదర్శన చేస్తే.. 25 మంది ఎమ్మెల్యేలు ఆయన వెనుకే ఉంటారని అంచనా వేస్తున్నారు. మరోవైపు ఇప్పుడున్న ముఖ్యనేతలను అధిష్ఠానం పూర్తిస్థాయిలో నమ్మటం లేదట. ఢిల్లీ అవసరాలకు తగ్గట్టుగా కప్పం కట్టలేక ఎప్పుడు కొప్పు ఎత్తేస్తారో అనే అనుమానంతోనే ఉందట. ఆ ముఖ్యనేత వ్యవహారశైలి బడేభాయ్‌కి కొంత దగ్గరగా మసిలినట్టు ఉండటం, బీజేపీ స్థానిక నేతలు రాష్ట్ర ప్రభుత్వంతో అంటకాగినట్టు ఉండటం కూడా అధిష్ఠానాన్ని అసౌకర్యానికి గురి చెస్తున్నట్టు గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. కాంగ్రెస్ అంటేనే ముఖ్యమంత్రుల మార్పుకు బ్రాండ్ అంబాసిడర్ పార్టీ. ఎప్పుడు ఎవరని మారుస్తారో తెలియదు. ఈ నేపథ్యంలోనే ఏదైనా జరగరానిది జరిగితే.. పొంగులేటి ముందు వరుసలో ఉంటాడని, లేదంటే మరో ఏక్‌నాథ్‌షిండేగా మారవచ్చని తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఆందోళనతో ఉన్నట్టు సమాచారం.

సీనియర్లకూ కంటగింపే

బయటికి రాసుకొని పూసుకొని తిరుగుతున్నారు కానీ 'ముఖ్య'నేతతోపాటు సీనియర్ నాయకులు కూడా పొంగులేటి అంటే కంటగింపుగానే ఉన్నారని నాయకుడు ఒకరు చెప్పారు. పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కాంట్రాక్టు పనులు తీసుకుంది. ఈ పనులకు సంబంధించిన బ్యాంకు ష్యూరిటీలను కరేబియన్‌కు చెందిన ఎగ్జిమ్ బ్యాంకు నుంచి తీసుకొచ్చారు. ఈ ష్యూరిటీని అప్పుడున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆమోదించింది. ఆ తరువాత వచ్చిన చంద్రబాబునాయుడు ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయగా.. దాన్ని ఆంధ్రాలో టీడీపీకి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉండే మీడియా సంస్థ హైలైట్ చేసింది. అది మొదలు వరుసగా లగ్జరీ రిస్టు వాచ్‌లు, హిమాయత్‌సాగర్‌లో ఆయన ఇంటిమీద ఆరోపణలు, ఈడీ దాడుల వ్యవహారాల పరంపర కొనసాగింది. ఇవి ఏవి కూడా పొంగులేటి పార్టీని అడ్డంపెట్టుకొని చెసుకున్న పనులు కావని, అయినప్పటికీ అధిష్ఠానానికి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చిందని ఆయన వర్గీయులు అంటున్నారు. సొంత పార్టీలోని 'ముఖ్య' నేతలే పక్కా పథకంతో ఇరికించారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏపీలోనూ 'పొంగులేటి' దుమారం

- అనుభవం లేకున్నా 270 కోట్ల డ్రెడ్జింగ్ కాంట్రాక్టు
- పనులు చేయకుండానే బిల్లులు పొందినట్టు ఆరోపణలు
- ఇసుక ఏదంటే ఎత్తుకు పోయారంటున్న 'రాఘవ' కంపెనీ
- కంపెనీకి నోటీసులు.. విచారణకు సిద్ధమైన అధికారులు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఇప్పుడు ఏపీ రాజకీయాల్లోనూ దుమారం రేపుతున్నది. గోదావరిలో కాటన్ బ్యారేజీ వద్ద పేరుకుపోయిన ఇసుకను డ్రెడ్జింగ్ ద్వారా తొలగించే రూ.270 కోట్ల విలువైన టెండర్‌ను అడ్డదారిలో దక్కించుకుందని, పనులేవీ చేయకుండానే బిల్లులు స్వాహా చేసిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కంపెనీపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఏపీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రూ.270 కోట్ల టెండర్

ధవళేశ్వరం కాటన్ బరాజ్ లోపల రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లకు మధ్య గోదావరిలో చాలా కాలంగా ఇసుక మేటలు పెరిగిపోయాయి. దీంతో డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక మేటలు తొలగించాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు మూడేండ్ల కింద రూ.270 కోట్ల అంచనాతో రాఘవ కన్‌స్ట్రక్షన్ టెండర్ దక్కించుకున్నది. అయితే అడ్డదారిలోనే ఆ టెండర్ దక్కిందని తాజాగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్‌లో 3 కంపెనీలు పోటీపడినా డ్రెడ్జింగ్‌లో ఎలాంటి అనుభవం లేని రాఘవ కంపెనీకి కాంట్రాక్టు ఇవ్వడంపై గతంలోనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. టెండర్‌ను దక్కించుకునేందుకు సదరు కంపెనీ కొందరితో లోపాయికారి ఒప్పందం చేసుకుని, తమకు వ్యతిరేకంగా ఉన్న పలువురు ఇంజినీర్లను అక్కడి నుంచి బదిలీ చేయించిందని, ఆ తరువాత అనుకూలంగా ఉన్న వారిని నియమించుకుందని సాగునీటి ఇంజినీర్లు, అక్కడి బోట్స్‌మెన్ సొసైటీలు బాహాటంగా ఆరోపిస్తున్నాయి.

పనులేవీ చేయకుండానే బిల్లులు..

టెండర్ దక్కించుకున్న రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఏపీలో ప్రభుత్వం మారే సమయానికి దాదాపు రూ.50 కోట్ల విలువైన పనులు చేసినట్టు బిల్లులు పెట్టుకుంది. అయితే అక్కడ డ్రెడ్జింగ్ చేసిన సూచనలేమీ లేవని క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన అధికారులే స్వయంగా వెల్లడిస్తున్నారు. డ్రెడ్జింగ్ చేసిన ఇసుక ఏదని అడిగితే పక్కన గుట్టలుగా పోస్తే ఎత్తుకుపోయారని సమాధానం చెబుతున్నదని అధికారులు వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ వ్యవహారంలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ నిర్వాకంతో ఉన్నతాధికారులు వరుసగా నోటీసులు సైతం జారీ చేశారు. ఎలాంటి డ్రెడ్జింగ్ చేయలేదని బరాజ్ నిర్వహణ చూస్తేనే తెలిసిపోతున్నదని ఇంజినీర్లు బాహాటంగా ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో పొంగులేటి కంపెనీపై విచారణకు సిద్ధమైనట్టు వెల్లడించారు.

ఆ పిల్‌పై విచారణ వాయిదా వేయిండి

- దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసులో పోలీసుల విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): జస్టిస్ సిర్పూర్కర్ కమిషన్ నివేదికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సింగిల్ జడ్జి తీర్పు వెలువడే వరకు దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసు విచారణను వాయిదా వేయాలని పోలీసులు హైకోర్టును కోరారు. దీంతో మధ్యంతర పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు పిటిషనర్లను ఆదేశించింది. దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసును సీబీఐకి అప్పగించాలన్న ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. పోలీసుల తరపున సీనియర్ న్యాయవాది ఆర్‌ఎన్ హేమేంద్రనాథ్ రెడ్డి వాదిస్తూ.. జస్టిస్ సిర్పూర్కర్ కమిషన్ నివేదికకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లు సింగిల్ జడ్జి పరిశీలనలో ఉన్నాయని, వాటిని సింగిల్ జడ్జి అనుమతిస్తే సిర్పూర్కర్ కమిషన్ నివేదిక ఉనికిలో ఉండదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సింగిల్ జడ్జి తీర్పు వచ్చే వరకు దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసును సీబీఐకి అప్పగించాలన్న పిల్‌పై విచారణ వాయిదా వేయాలని కోరారు. దీనిపై కౌంటర్ దాఖలు చేస్తామని పిటిషనర్ల తరపు న్యాయవాది వసుధానాగరాజ్ తెలియజేయడంతో.. తదుపరి విచారణను దసరా సెలవుల తర్వాత చేపడతామని హైకోర్టు ప్రకటించింది.

23వ సారి ఢిల్లీకి సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి...

హైడ్రా కూల్చివేతలు, మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్టు వార్తలొస్తున్న నేపథ్యంలో అధిష్ఠానం సీరియస్‌గా ఉన్నదని, వారికి వివరణ ఇచ్చేందుకే సీఎం ఢిల్లీ వెళ్లారన్న చర్చ జరుగుతున్నది. దీంతోపాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఈడీ దాడుల గురించి కూడా అధిష్ఠానం పెద్దలకు వివరించే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. దసరాలోపు మంత్రివర్గాన్ని విస్తరించే దిశగా అధిష్ఠానంతో సంప్రదింపులు జరిపే అవకాశం ఉన్నట్టు పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత హస్తినకు వెళ్లడం ఇది 23వ సారి.

ఏడాది భారత్‌లో.. మరో ఏడాది యూఎస్‌లో

- నోట్రీడ్యామే డీ న్యామర్ యూనివర్సిటీ డీన్ జాన్ విట్జ్ వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): అమెరికాలో మూడేండ్ల వర్క్ పర్మిట్ లభించే ట్విన్నింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు ఆశావాహుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నోట్రీడ్యామే డీ న్యామర్ యూనివర్సిటీ డీన్ జాన్ విట్జ్, ఎడ్యు టూ టెక్ సంస్థ సీఈవో హరికాంత్ తెలిపారు. ఇందులో చేరిన వారు ఎంబీఏను ఒక ఏడాది భారత్‌లో, మరో ఏడాది యూఎస్‌లో చదవొచ్చని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌కు వచ్చిన జాన్ విట్జ్ మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటికే ఎంబీఏలో మొదటి సంవత్సరం పూర్తిచేసిన వారు ట్విన్నింగ్ ప్రోగ్రాంలో చేరవచ్చని సూచించారు. బీకాం, బీబీఏ విద్యార్థులు రెండేండ్లు ఇండియాలో, చివరి సంవత్సరం ఎన్‌డీఎన్‌యూ వర్సిటీలో చదవొచ్చని తెలిపారు. అక్టోబర్ 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 99597 42565 నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఈడీ నివేదిక ఆలస్యమెందుకో?

- సోదాలు జరిగి ఐదురోజులైనా వివరాలు వెల్లడించని ఈడీ
- తనిఖీలపై ఇంతవరకు నోరు మెదపని పొంగులేటి
- నాటకీయ పరిణామాలపై సర్వత్రా ఉత్కంఠ

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇండ్లు, కార్యాలయాల్లో రెండురోజులపాటు సోదాలు నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఇంతవరకు దానిపై ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఏం జరిగింది? ఎంత నగదు దొరికింది? ఏవేం డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు? క్రిప్టో ఖాతాల వివరాలు ఏంటి? అనే విషయాలు సోమవారం కూడా వెల్లడి కాలేదు. రెండ్రోజుల సోదాల్లో కొన్ని కోట్ల రూపాయల నగదు దొరికిందని, ఇతర అక్రమ లావాదేవీల వివరాలు తెలిశాయని పలువురు అంటున్నా.. ఈడీ అధికారులు మాత్రం వాటిపై స్పష్టతనివ్వకపోవడం సర్వత్రా ఆసక్తిగా మారింది. సోదాలపై అధికారిక ప్రకటన లేకపోవడంతో ఏమైనా రాజకీయ కోణం ఉందా? అనే అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

వివరాలు వెల్లడించని పొంగులేటి..

గతంలో తన ఇండ్లు, ఆఫీసుల్లో ఎప్పుడు కేంద్ర దర్యాప్తు సంస్థల సోదాలు జరిగినా.. అదే రోజు ఏం జరిగిందో? ఎందుకు సోదాలు చేశారో? పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించేవారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అతని ఇండ్లు, ఆఫీసుల్లో జరిగిన మొదటి సోదాలు కావడం, భారీగా డబ్బులు దొరికాయనే వార్తలు వెలువడటం, ఈడీ నుంచి అధికారిక ప్రకటన ఏమీ లేకపోవడంతో ఆయన కూడా మీడియా సమావేశం పెట్టేందుకు వెనక్కి తగ్గారని చర్చించుకుంటున్నారు. 'ఏం జరిగింది అన్నా' అని కొందరు అంటే.. 'ఏం జరుగుతుందో చూడాలి అన్నా' అంటూ దాటవేస్తున్నారని సన్నిహితులు చెప్తున్నారు. ఇంకా వివరాలు వెల్లడి కాకపోవడం పట్ల.. 'రాత్రికి రాత్రే ఎవరు చక్రం తిప్పారు' అంటూ మరికొందరు మాట్లాడుకుంటున్నారు.

ఈడీ సోదాలన్నీ హైడ్రామానా?

తెలంగాణలో శుక్ర, శనివారాల్లో ఢిల్లీ ఈడీ అధికారులు జరిపిన సోదాల్లో మూడు కౌంటింగ్ మెషీన్లతో లెక్కపెట్టేంత డబ్బు దొరికినా కూడా.. లెక్క బయటికి రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. జూబ్లీహిల్స్, హిమాయత్‌సాగర్‌లలో ఈడీ సోదాలు జరిగాయి. సోదాల మధ్యలో అధికారులు బయటికి వెళ్తూ.. డబ్బులు లెక్కపెట్టే కౌంటింగ్ మెషీన్లు తెస్తూ.. నానా హంగామా చేశారు. సోదాలు చేపట్టి ఐదు రోజులు అయినా కూడా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. మరోవైపు బంజారాహిల్స్‌లోని ఓ కార్యాలయంలో 'సీపీయూలు, హార్డ్‌డిస్కులు, ఇతర కీలక పత్రాల తరలింపు'పై సైతం ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిసింది. దీంతో అసలేం జరుగుతోంది? అనే అనుమానాలు, ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

బర్రె హెల్త్‌సర్టిఫికెట్‌కూ లంచం

పశువైద్యాధికారిని పట్టుకున్న ఏసీబీ అధికారులు

మాల్, సెప్టెంబర్ 30 : సర్టిఫికెట్ జారీ చేసేందుకు పాడి రైతు వద్ద లంచం తీసుకుంటూ నల్లగొండ జిల్లాలో ఓ పశువైద్యాధికారి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌చంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండలం నసర్లపల్లికి చెందిన పాడి రైతు బర్రెలపై రూ.10 లక్షల బ్యాంకు లోన్ తీసుకునేందుకు వీలుగా సదరు బర్రెలకు సంబంధించిన హెల్త్ సర్టిఫికెట్ జారీ కోసం పశువైద్యాధికారి జీజే పాల్‌ను సంప్రదించాడు. సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.8 వేలు లంచం డిమాండ్ చేయగా, రూ.6 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ మేరకు రైతు సోమవారం పశువైద్యాధికారికి అతడి కార్యాలయంలో రూ.6 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పశువైద్యాధికారిని అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్‌లోని అతడి ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు.

ఏసీబీ అధికారులకు పట్టుబడిన పశువైద్యాధికారి జీజే పాల్

26వేల స్కూళ్లలో అరకొరగా వసతులు

- గురుకులాల స్థానంలోనే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- ఫీజుల నియంత్రణకు కమిటీ: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): 26వేల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు తక్కువగా ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తాము అన్ని స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం సచివాలయం లో డీఎస్సీ-2024 ఫలితాలను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే డీఎస్సీని నిర్వహించడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పుడున్న గురుకులాలను ఒకే ప్రాంగణంలోకి చేర్చి 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్' ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. నియోజకవర్గంలోనే 20-25 ఎకరాల్లో రూ. 100-125 కోట్లను వెచ్చించి భవనాలను నిర్మించి వసతులు కల్పిస్తామని వెల్లడించారు. డీఎస్సీ పరీక్షలు ముగిసిన 55 రోజుల్లోనే ఫలితాలు విడుదల చేశామని, 1: 3 నిష్పత్తిలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని వెల్లడించారు. అక్టోబర్ 9న ఎల్బీస్టేడియంలో ని యామక పత్రాలను అందజేస్తామని పే ర్కొన్నారు. ఫీజుల నియంత్రణకు కమిటీ వేస్తామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

238 ప్రాంతాల్లో ఎఫ్‌డీసీ సర్వే

- కుటుంబం ఫొటో దిగడం ఆప్షన్ మాత్రమే
- ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఫ్యామిలీ డిజిటల్ కార్డుల (ఎఫ్‌డీసీ) జారీకి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 238 ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. 119 నియోజకవర్గాల్లో ఈ నెల 3వ తేదీ నుంచి ఐదు రోజులపాటు సర్వే చేయాలని ఆదేశించారు. ఎఫ్‌డీసీ అం శంపై సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్టు కోసం ప్రతి నియోజకవర్గం నుంచి ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఒకవేళ పూర్తిగా పట్టణ/నగర నియోజకవర్గమైతే రెండు వార్డు లు/డివిజన్లు, పూర్తిగా గ్రామీణ నియోజకవర్గమైతే రెండు గ్రామాల్లో సర్వే చేయాలని, మొత్తంగా 238 ప్రాంతాల్లో సర్వే సమర్థం గా నిర్వహించాలని ఆదేశించారు. కుటుంబసభ్యులు అందరూ సమ్మతిస్తేనే కుటుంబం ఫొటో తీయాలని, లేకుంటే ఫొటో తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ఉమ్మడి జిల్లాలకు ఉన్న నోడల్ అధికారులు కలెక్టర్లకు మార్గనిర్దేశం చేయాలని, అప్పుడే పకడ్బందీగా కార్యక్రమం కొనసాగుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. కుటుంబసభ్యుల వివరాల నమోదు, మార్పులుచేర్పుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పొరపాట్లకు తావివ్వవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎదురయ్యే సానుకూలతలు, ఇబ్బందులతో నివేదిక తయారుచేయాలని ఆదేశించారు. దానిపై చర్చించిన అనంతరం లోపాలను సవరించి సర్వేకు శ్రీకారం చుట్టాలని సూచించారు.

200 ఏండ్ల చెట్టుకు అంత్యక్రియలు

యూపీలో హిందూ పద్ధతిలో నిర్వహణ

ముజఫర్ నగర్, సెప్టెంబర్ 30: ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్‌లో 200 ఏండ్లు గల పెద్ద చెట్టుకు మనుషుల మాదిరి శుక్రవారం అంత్యక్రియలు జరిగాయి. బుధవారం ఈ చెట్టు నేలకూలింది. అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించే శాలు సైని(37) ఈ చెట్టుకు అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మొదటిసారి ఇలా ఒక చెట్టుకు అంత్యక్రియలు నిర్వహించారు. హిందూ మత సంప్రదాయం ప్రకారం చెట్టులోని కొన్ని భాగాలకు ఆమె దహన సంస్కారాలు నిర్వహించారు. 'ముక్తి' లభించడంలో చెట్టుకు సాయపడమని తన అంతరంగం తనకు చెప్పిందని సైని అన్నారు. ఆ చెట్టును మొదటిసారి శుక్రవారమే చూశానని.. కుటుంబంలో పెద్దవారిని కోల్పోయినట్టు అనిపించిందని తెలిపారు.

డీఎస్సీ ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి...

చేశారు. డీఎస్సీకి హాజరైన అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్‌ఎల్)ను జిల్లాలు, పోస్టులవారీగా వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20న డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. జూలై 7 నుంచి ఆగస్టు 5 వరకు కం ప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో పరీక్షలను నిర్వహించగా, 2.46 లక్షల మంది హాజరయ్యారు. డీఎస్సీలో వచ్చిన మార్కులకు టెట్ మార్కులను కలిపి జీఆర్‌ఎల్‌ను విడుదల చేశారు.

నేటి నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్

జీఆర్‌ఎల్ విడుదలైన నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ 1:3 చొప్పున అభ్యర్థులను ఎంపికచేస్తుంది. జిల్లాల వారీగా, పోస్టులు, రోస్టర్ వారీగా జాబితాలను జిల్లాలకు పంపిస్తుంది. మొత్తంగా 33 వేల మందిని సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఎంపిక చేస్తారు. వీరికి మంగళవారం నుంచి ఈ నెల 5 వరకు ఆయా జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపడతారు. ఇది ముగిసిన తర్వాత 1:1 చొప్పున అభ్యర్థులను ఎంపికచేసి, ఈ నెల 9 ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలను అందజేస్తారు.

మొరాయించిన వెబ్‌సైట్

డీఎస్సీ ఫలితాల విడుదల తర్వాత డీఎస్సీ వెబ్‌సైట్ మొరాయించింది. అభ్యర్థులంతా ఒకేసారి ఫలితాలు తెలుసుకునేందుకు తాపత్రయపడటంతో వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. సాయంత్రం వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. రాత్రి తర్వాతే ఫలితాలపై అభ్యర్థులకు ఒక స్పష్టతవచ్చింది. విద్యాశాఖ రూపొందించిన రివైజ్డ్ ఫైనల్ కీ' ప్రకారమే డీఎస్సీ ఫలితాలను ప్రకటించారు. గతంలో విడుదలచేసిన ఫైనల్ కీపై అభ్యంతరాలు రావడంతో యూనివర్సిటీ ప్రొఫెసర్లతో పరిశీలన జరిపిన అధికారులు రివైజ్డ్ ఫైనల్ కీని తయారుచేశారు. మొత్తం నాలుగైదు ప్రశ్నలకు సమాధానాలు మారినట్టు అధికారులు తెలిపారు.

డీఎస్సీలో ఆటో డ్రైవర్‌కు జిల్లా ఫస్ట్ ర్యాంకు

బండారి నరేశ్

నెల్లికుదురు, సెప్టెంబర్ 30: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలో నిరుపేద కుటుంబానికి చెందిన బండారి ఎల్లమ్మ-రామరాజు దంపతుల కుమారుడు నరేశ్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చిన్న వయసులోనే తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ బాధ్యతలు మీదపడ్డాయి. చెల్లి, తమ్ముడికి పెండ్లి చేశాక తాను పెండ్లి చేసుకున్నాడు. తెలంగాణ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ వేయగానే ఎలాంటి కోచింగ్ లేకుండా పట్టుదలతో చదివాడు. 76.67 మార్కులు సాధించి ఎస్‌ఏ తెలుగు సబ్జెక్టులో జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించాడు.

డీఎస్సీ లో తండ్రీకొడుకుల సత్తా

భానుప్రకాశ్, గోపాల్

మరికల్, సెప్టెంబర్ 30: నారాయణపేట జిల్లా రాకొండకు చెందిన జంపుల గోపాల్ తెలుగు పండిట్ విభాగంలో జిల్లాలో ఫస్ట్ ర్యాంక్, స్కూల్ అసిస్టెంట్ తెలుగులో జిల్లా 3వ ర్యాంకు సాధించాడు. ఆయన పెద్ద కొడుకు భానుప్రకాశ్‌కు గణిత విభాగంలో ఎస్‌ఏగా జిల్లాలో 9వ ర్యాంక్ సాధించాడు. ఇటీవల చిన్న కుమారుడు చంద్రకాంత్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈగా ఉద్యోగం సాధించాడు. గోపాల్ భార్య విజయలక్ష్మి ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేటలోని ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్నారు.

ఒకే డీఎస్సీలో రెండు కొలువులు

గుండోజి నగేశ్

మహదేవపూర్ (కాళేశ్వరం), సెప్టెంబర్ 30: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన గుండోజి నగేశ్ సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ చాటాడు. తెలుగు పండిత్‌లో జిల్లాలో రెండో ర్యాంక్, ఎస్జీటీలో 38వ ర్యాంక్ సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన నగేశ్ తండ్రి బ్రహ్మయ్య కులవృత్తి చేసుకుంటా నలుగురు పిల్లలను చదివించాడు. నగేశ్ ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివి ఒకేసారి రెండు కొలువులకు ఎంపికయ్యాడు. కన్నవారి కండ్లల్లో ఆనందాన్ని నింపాడు.

డీఎస్సీ జాబితాలో పలువురి పేర్లు గల్లంతు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): విద్యాశాఖ విడుదల చేసిన డీఎస్సీ-2008 అర్హులైన అభ్యర్థుల జాబితాలో పలువురి పేర్లు గల్లంతయ్యాయి. ఐటీడీఏకు చెందిన 67 పోస్టులు కలిపితే మొత్తంగా 102 మందిని జాబితాలో చేర్చలేదు. దీంతో వారు సోమవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌కు తరలివచ్చారు. 100 మందికి పైగా అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డిని కలిసి న్యాయం చేయాలని కోరారు. దీంతో స్పందించిన ఆయన ప్రాథమిక జాబితాలో పేర్లుండి, కొత్త జాబితాలో పేర్లు లేకపోతే ఇలాంటి వారికి సైతం అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే సర్క్యూలర్‌ను జారీచేస్తామని అభ్యర్థులకు భరోసాకల్పించారు.

సచివాలయంలో డిప్యూటేషన్లు రద్దు?

- దీర్ఘకాలంగా కొనసాగుతున్న అధికారులు వెనక్కి
- ఎస్‌వోలు మొదలు పీఎస్‌ల వరకు జాబితా సిద్ధం

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): సచివాలయంలో సుదీర్ఘంగా డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న అధికారులపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్టు తెలిసింది. మంత్రులు, ఉన్నతాధికారుల దగ్గర పీఎస్‌లుగా, పీఏలుగా, వివిధ విభాగాల్లో సెక్షన్ ఆఫీసర్లుగా, ఇతర హోదాల్లో కొనసాగుతున్న వారి జాబితాను సిద్ధం చేసినట్టు సచివాలయ వర్గాలు తెలిపాయి. కొందరిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, మరికొందరిపై సహోద్యోగులే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ముఖ్యంగా సచివాలయంలోని ఓ ఉన్నతాధికారి దగ్గరున్న పీఎస్ తీరుపై సీఎంవో వరకు ఫిర్యాదులు వెళ్లినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. తమకు కనీస మర్యాద ఇవ్వడం లేదని, ప్రతి చిన్న విషయానికి కసురుకుంటున్నారని సహచర ఉద్యోగులు, సిబ్బంది ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీంతో ఇతర శాఖల నుంచి సచివాలయంలోకి డిప్యూటేషన్‌పై వచ్చి, ఇక్కడే తిష్టవేసిన అధికారుల జాబితాను తయారు చేయాలని సీఎంవో ఆదేశించినట్టు సమాచారం. ఈ వివరాలు జీఏడీకి చేరాయని తెలిసింది. ఫైల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపితే డిప్యూటేషన్లను రద్దు చేసి వారిని మాతృవిభాగాలకు పంపనున్నట్టు సచివాలయవర్గాల్లో చర్చ జరుగుతున్నది.

బాగుచేయరు.. నీళ్లివ్వరు!

- ఇటీవలి వర్షాలకు తెగిన కాలువలు
- దెబ్బతిన్న చెరువులు, ప్రాజెక్టులు
- మంత్రిపర్యటనలే తప్ప ఫలితం శూన్యం
- 280కోట్లకు 75కోట్లే విడుదల
- పెండింగ్ బిల్లులే 40కోట్లకు పైగా
- ఎక్కడా సాగని మరమ్మతులు
- 25శాతం కూడా పూర్తికాని పరిస్థితి
- 5లక్షల ఎకరాలకు నీరందని దుస్థితి

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. కాలువలు, చెరువులకు గండ్లు పడ్డాయి. షట్టర్లు, వియర్లు దెబ్బతిన్నాయి. వాటిని తక్షణం పునరుద్ధరించి సాగునీటిని అందివ్వాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టపోవడం విమర్శలకు తావిస్తున్నది. సమీక్షలు తప్ప మరమ్మతులకు పైసా విదిల్చకపోవడంతో 25శాతం కూడా పనులు పూర్తికాలేదు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో ఒక్కటంటే ఒక్క పనీ మొదలు కాలేదు.

284 చెరువులు, 133కాలువలకు గండ్లు

రాష్ట్రవ్యాప్తంగా 284చెరువులకు గండ్లు పడ్డాయి. మరో 274 చెరువుల వియర్లు, తూములు, షట్టర్లు దెబ్బతిన్నాయి. సాగర్ ఎడమకాలువ సహా మేజర్ ప్రాజెక్టులకు సంబంధించి మొత్తం 133 కాలువలు తెగిపోయాయి. 87చోట్ల మేజర్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. ఎత్తిపోతల పథకాలకు సంబంధించి పాలమూరు రంగారెడ్డి స్కీమ్‌లోని వట్టెం, భక్త రామదాసు పంప్‌హౌస్, పలు ఐడీసీ లిఫ్టులు నీట మునిగాయి. మొత్తంగా 786 నిర్మాణాలు దెబ్బతినగా వాటి శాశ్వత మర్మమతులకు రూ.253.42కోట్లు, తాత్కాలిక మరమ్మతులకు రూ.23.90కోట్లు కావాలని అంచనా వేయగా ప్రభుత్వం రూ.75కోట్లే మంజూరు చేసింది. మొత్తంగా నిధులు రాకపోవడంతో సంబంధిత చీఫ్ ఇంజినీర్లే తమ పరపతిపై పనులు చేయిస్తున్నారు. అవీ మందకొడిగా కొనసాగుతున్నాయి. 786 పనుల్లో 190చోట్ల పూర్తయ్యాయి. మరో 37చోట్ల పురోగతిలో ఉండగా, 559చోట్ల మొదలే కాలేదు. ఇక ఓఅండ్‌ఎం పనులకు దాదాపు రూ.40 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం మంజూరు చేసిన వాటిలో సగానికిపైగా బకాయిల చెల్లింపునకే ఖర్చుకానున్నాయి. దీంతో ఆ నిధులతో పనులు ఎలా చేసేదని ఇంజినీర్లు తలలు పట్టుకుంటున్నారు. ప్రాజెక్టులు, చెరువుల్లో నీళ్లున్నా మరమ్మతులు పూర్తికాక 5లక్షల ఎకరాలకు సాగునీరందని దుస్థితి నెలకొనడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ముగ్గురు మంత్రులున్నా ఖమ్మంలో సున్నా..

చెరువులు, ఇతర పథకాలన్నీ కలిపి అత్యధికంగా వరంగల్‌లో 150చోట్ల, ఖమ్మంలో 109, ములుగులో 94, ఆదిలాబాద్‌లో 60, సూర్యాపేటలో 49చోట్ల నష్టం వాటిల్లింది. ఇప్పటివరకు ఆయా జిల్లాల్లో పనులు మొదలు కాలేదు. ఖమ్మం జిల్లా నుంచి డిప్యూటీ సీఎం భట్టి సహా, మంత్రులు తుమ్మల, పొంగులేటి ప్రాతినిధ్యం వహిస్తున్నా అక్కడ ఒక్క పనీ మొదలు కాకపోవడం గమనార్హం. నల్లగొండ, ములుగు, జిల్లాలదీ ఇదే పరిస్థితి. ప్రధానంగా ఎడమకాలువ మరమ్మతులు పూర్తికాకపోవడంతో నీటిని విడుదల చేయలేని పరిస్థితి నెలకొన్నది.

ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న కాల్వలు

క్యాటగిరీ	దెబ్బతిన్నవి	గండ్లు పడినవి
చెరువులు	271	284
ప్రాజెక్టులు/కాలువలు	87	133
మేజర్/ఐడీసీ లిఫ్ట్‌స్కీములు	8	00
పునరుద్ధరించినవి		190
పురోగతిలో ఉన్నవి		37
ఇంకా చేపట్టనివి		559

మంత్రి ఉత్తమ్ ఆర్భాటమే..

వర్షాలతో దెబ్బతిన్న ప్రాజెక్టులు, చెరువులు, కాలువల పునరుద్ధరణ పనులను ఆగమేఘాల మీద పూర్తిచేస్తామని సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఢంకా బజాయించి చెప్పారు. చీఫ్ ఇంజినీర్లు, ఎస్‌ఈలతో సమీక్షలు నిర్వహించారు. తెగిన సాగర్ ఎడమ కాలువను చూసేందుకు రెండు సార్లు పర్యటించారు. మీడియా ప్రతినిధులను సైతం వెంటబెట్టుకొని హెలికాప్టర్‌లో వెళ్లారు. కానీ సొంత జిల్లాలోనే పునరుద్ధరణ పనులు పూర్తిచేయలేకపోయారు. సాగునీరందించాలని సొంత జిల్లా రైతులే రోడ్డెక్కుతున్నారు.